క్లుప్తంగా

పోలింగ్‌పై నాయకులతో మంతనాలు



నాయకులతో పోలింగ్ సరళి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే పెద్దారెడ్డి

తాడిపత్రిరూరల్: తాడిపత్రి నియోజక వర్గంలో సోమవారం జరిగిన పోలింగ్ సరళిపై నాయకులతో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చర్చలు జరిపారు. పోలింగ్ ప్రారంభం నుంచి తాడిపత్రి పట్టణంలోని నాయకులతో పాటు తాడిపత్రి, యాడికి, పెద్దపప్పూరు, పెద్దవడుగూరు మండలాల మద్దతుదారులతో ఫోన్‌లో మాట్లాడుతూ కనిపించారు. అలాగే తాడిపత్రి పట్టణంలోని వివిధ పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. పోలింగ్‌కు పెద్ద సంఖ్యలో మహిళలు, మైనార్టీలు, వృద్ధులు వచ్చే విధంగా చూడాలని, వారిని పోలింగ్ కేంద్రం వద్దకు తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలింగ్ ముగిసిన తరువాత కార్యాలయానికి వచ్చిన నాయకులతో పోలింగ్ సరళి, ఓటింగ్ శాతంపై చర్చించారు. అనుకున్న విధంగా మహిళలు, వృద్ధులు, మైనార్టీలు ఎక్కువ సంఖ్యలో ఓటింగ్‌కు తీసుకురావడంతో విజయవంతమయ్యామని పలువురు నాయకలు తెలిపారు.

ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఇంటి వద్ద బందోబస్తు



పోలీసు బందోబస్తు ఉన్న దృశ్యం

తాడిపత్రిరూరల్: స్థానిక ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఇంటి వద్ద భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలింగ్ పురస్కరించుకుని తాడిపత్రి పట్టణంతోపాటు తాడిపత్రి, యాడికి మండలాల్లో టీడీపీ వర్గీయులు తెగబడి వైఎస్సార్ సీపీ మద్దతుదారులపై దాడులకు దిగారు. ముందుజాగ్రత్తగా ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఇంటి వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఓటు వేసిన రాష్ట్ర మహిళా కార్యదర్శి



ఓటు వేసిన పేరం స్వర్ణలత

తాడిపత్రిరూరల్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పేరం స్వర్ణలత ఓటు వేశారు. కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి ఆమె ఓటు హక్కు వినియోగించుకున్నారు.

యార్కెట్ యార్డ్ చైర్‌పర్సన్..



ఓటు హక్కు వినియోగించుకున్న శింగనమల మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ భూమిరెడ్డి సునీత

పుట్లూరు: మండల కేంద్రంలోని పోలింగ్ స్టేషన్‌లో శింగనమల మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ భూమిరెడ్డి సునీత తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆమె వెంట పలువురు నాయకులున్నారు.



శింగనమల మండలం సలకంచెరువులో వృద్ధురాలిని మోసుకెళ్తున్న కానిస్టేబుల్

వెల్లువెత్తిన ఓటింగ్

తాడిపత్రి, శింగనమల నియోజకవర్గాల్లో పోలింగ్‌కు ఓటర్లు పోటెత్తారు. తాడిపత్రి పట్టణంలో టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్ సీపీ నాయకులపై దాడులకు తెగపడ్డారు. మిగిలిన మండలాల్లో చెదురుమదురు సంఘటనలు మినహా ఓటింగ్ ప్రశాంతంగా సాగింది.

- తాడిపత్రి, పెద్దపప్పూరు, యాడికిలో జేసీ అనుచరుల వీరంగం
- స్వల్ప ఘర్షణలతో ముగిసిన పోలింగ్

తాడిపత్రిటౌన్: తాడిపత్రి మండలం సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి సోమవారం జరిగిన పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఉదయం 6 గంటలకే ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్దకు చేరుకొని ఓటింగ్ కోసం ఎదురు చూడటం జరిగింది.ఉదయం 7గంటలకు అధికారులు పోలింగ్ ప్రారంభించారు రాత్రి 9గంటల వరకు పోలింగ్ కొనసాగింది. చిన్నపోలమడ గ్రామంలో మొదట పార్లమెంట్ అభ్యర్థుల ఈవీఎం పనిచేయక పోవడంతో గంట ఆలస్యంగా పోలింగ్ ప్రారంభం అయింది. పోలింగ్ మధ్యలో అసెంబ్లీ అభ్యర్థుల ఈవీఎం మొరాయించడంతో పోలింగ్ నిలిపివేసి మరో ఈవీఎం ఏర్పాటు చేసి పోలింగ్‌ను అధికారులు కొనసాగించారు. మండలంలోని వంగనూరు , బోడాయిపల్లి గ్రామాల్లో టీడీపీ, వైఎస్సార్‌సీపీ నాయకుల మధ్య చిన్నపాటి గొడవ చోటు చేసుకుంది. పోలీసుల జోక్యంతో సమస్య సద్దుమణిగింది.



పెద్దవడుగూరు మండలంలో మిడుతూరు గ్రామంలోని పోలింగ్ కేంద్రం వద్ద క్యూ

పెద్దవడుగూరు: మండలంలోని 25 పంచాయతీల్లో 46 పోలింగ్ పోలింగ్ కేంద్రాలల్లో ఉదయం 7 గంటలకే పోలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. మండల కేంద్రమైన పెద్దవడుగూరు లోని 22, 23, 24, 25, 26 పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం 7 గంటలకే ఓటర్లు బారులు తీరారు. మిడుతూరు , పి.వీరన్నపల్లి, దిమ్మగుడి తదితర గ్రామాల్లో ఈవీఎంలు మొరాయించడంతో ఓటర్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మిడుతూరులో ఈవీఎంలు నెమ్మదిగా పని చేస్తుండటంతో సాయంత్రం 6 గంటల వరకూ పోలింగ్ కేంద్రం వద్ద మహిళలు బారులు తీరారు.

జేసీ అనుచరుల వీరంగం

పెద్దపప్పూరు: మండలంలో సోమవారం జరిగిన ఎన్నికల్లో పలుచోట్ల జేసీ అనుచరులు వీరంగం సృష్టించారు. ముచ్చుకోటలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై దాడికి పాల్పడాలని అదే గ్రామానికిచెందిన జేసీ వర్గీయులు పోలింగ్‌కేంద్రం వద్ద సమస్యను సృష్టించాలని వాదనకు దిగారు. వరదాయపల్లిలో టీడీపికి ఓటువేయాలని చెబుతుండగా వైఎస్సార్‌సీపీ నాయకులు అడుకోవడంతో స్వల్ప ఘర్షణ చోటుచేసుకుంది. పెద్దపప్పూరులో గార్లదిన్నె, చిన్నపప్పూరు గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీకి వస్తున్న ఆదరణను జీర్ణించుకోలేక వాగ్వాదానికి పాల్పడ్డారు.చిన్నపప్పూరు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలకు ఓటువేయడానికి వెలుతున్న ఓటర్లను ప్రలోభపెట్టాలని ప్రత్నింస్తుండగా వైఎస్సార్‌సీపీ నాయకులు అడ్డుకోవడంతో బరితెగించిన టీడీపీ నేతలు రాళ్లతో దాడిచేయాలని ప్రయత్నించారు. పోలీసులు రంగప్రవేశం చేయడంతో వారు జారుకున్నారు.



మిడుతూరు లో ఓటు వేయించడానికి వృద్ధురాలిని తీసుకెళ్తున్న దృశ్యం

యాడికి: సార్వత్రిక ఎన్నికలలో పోలింగ్ ఘట్టం ముగిసింది. మండలంలోని 14 పంచాయతీల్లోని 37 గ్రామాల్లోని 55 పోలింగ్ కేంద్రాల వద్దకు ఉదయం 7 గంటలకు ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేందుకు ఓటర్లు బారులు తీరారు. మండలంలోని రాయలచెరువు, పుప్పాల, యాడికి, వేములపాడు తదితర పోలింగ్ కేంద్రాల్లో సమయం మించిన తర్వాత కూడా ఓటర్లు బారులు తీరా రు. చెదురు ముదురు సంఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా ముగిసిం ది. సీఐ నాగార్జున రెడ్డి, పోలీసులు, కేంద్ర బలగాలు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.



తాడిపత్రి మండలం చుక్కలూరు గ్రామంలో ఓటు వేసేందుకు బారులు తీరిన గ్రామస్తులు



పి.వీరన్నపల్లి పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు



యాడికి మండలం చందనలో బారులు తీరిన ఓటర్లు



పెరవలిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వీరాంజనేయులు



పెద్దపప్పూరు మండలం అమ్మలదిన్నెలో బారులు తీరిన మహిళా ఓటర్లు



సీ.బండమీదపల్లిలో బారులు తీరిన ప్రజలు



నార్పలలో ఓటు హక్కును వినియోగించుకున్న నార్పల సత్యనారాయణరెడ్డి, స్వాతిలతరెడ్డి



శింగనమలలో పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేసిన ఎన్నికల పరిశీలకుడు



గార్లదిన్నెలో ఓటు వేసిన యువత

పోలింగ్ ప్రశాంతం

శింగనమల: మండలంలో సోమవారం అసెంబ్లీ, ఎంపీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం పోలింగ్ ప్రారంభమైన కొద్దిసేపటికీ శింగనమలలో 83 పోలింగ్ కేంద్రంలో ఈవీఎం మొరాయించింది. తరువాత అధికారులు వచ్చి ఈవీఎంను పని చేసేలా చేశారు. గురుగుంట్లలో సైతం ఈవీఎం మొరాయించడంతో సాయంత్రం వరకూ జనం ఓటు హక్కును వినియోగించుకోవడానికీ క్యూ లైన్‌లో ఉన్నారు. మండలంలో 43 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ జరిగింది. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.వీరాంజినేయులు మండలంలోని సొంతగ్రామం సి.బండమీదపల్లిలో ఓటు వేశారు. అనంతరం ఆయన మండలంలోని శింగనమల, సోదనపల్లి, పెరవలి, ఉల్లికల్లు, వెస్ట్ నరసాపురం, పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ సరళిని పరిశీలించారు. శింగనమల, సోదనపల్లి, పెరవలి, సీ.బండమీదపల్లి, పోలింగ్ కేంద్రాలను ఎన్నికల పరిశీలకులు పరిశీలించారు. సోదనపల్లిలో టీడీపీ, వైఎస్సార్‌సీపీ వర్గీయులు వాగ్వాదం చేసుకవడంతో పోలీసులు సర్దిచెప్పారు. సలకంచెరువులో ఓటు వేయడానికీ ఆటోలో వచ్చిన నడవలేని వృద్ధురాలును , అక్కడ విధుల్లో ఉన్న పోలీస్ కానిస్టేబుల్ ఎత్తుకుని ఓటు వేయించడానికీ పోలింగ్ కేంద్రానికి తీసుకెళ్లారు. మండలంలో పోలిగ్ ప్రశాంతంగా జరగడానికీ సీఐ శ్రీధర్, ఎస్ఐ అంజినేయులు, పోలీస్ సిబ్బంది కృషి చేశారు.

యల్లనూరు: మండలంలో ఉదయం 7గంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. యల్లనూరు పోలింగ్ కేంద్రంలో సాయంత్రం 6 గంటలు దాటుతున్నా ఓటర్లు బారులు తీరారు. ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామాలపై నిఘా పెట్టి సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్ఐ గిరిబాబు పర్యవేక్షించారు. వెన్నపూసపల్లి, గొడ్డుమర్రి గ్రామాల్లో అల్లరిమూకలు రెచ్చిపోవడంతో ఎస్ఐ గిరిబాబు సకాలంలో స్పందించి సమస్యను సర్దుబాటు చేశారు. కూచివారిపల్లి, బుక్కాపురం, ఆరవేడు, తిమ్మంపల్లి, చింతకాయమంద, శింగవరం, దంతలపల్లి, నీర్జాంపల్లి, కల్లూరు, గడ్డంవారిపల్లి, మల్లాగుండ్ల, వెన్నపూసపల్లి, యల్లనూరు తదితర గ్రామాల్లో ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, ప్రచార కమిటీ జిల్లా అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, జెడ్పీటీసీ భోగతి ప్రతాప్‌రెడ్డి పర్యటించారు. తిరుమలాపురం, మేడికుర్తి, వేములపల్లి సర్పంచులు రామాంజులరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, అశోక్‌కుమార్‌రెడ్డి ఎన్నికల తీరును పరిశీలించారు. ఎక్కడా చిన్నపాటి గొడవ లేకుండా పోలింగ్ జరగడం ఇదే మొదటిసారని మండలవాసులు చర్చించుకున్నారు.



గార్లదిన్నెలో ఓటర్లకు అభివాదం చేస్తున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వీరాంజనేయులు

పుట్లూరులో 81.54 శాతం

పుట్లూరు: గతంలో కంటే పుట్లూరు మండలంలో సోమవారం నిర్వహించిన సార్వత్రిక ఎన్నికలకు ఓటర్లు పోటెత్తారు. మండలంలో 81.54 శాతం పోలింగ్ జరిగినట్లు అధికారులు ప్రకటించారు. సుదూర ప్రాంతాల్లో ఉన్న వారు సైతం సొంత గ్రామాలకు చేరుకుని ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. మండలవ్యాప్తంగా 39 పోలింగ్ కేంద్రాలు ఉండగా 30,932 మంది ఓటర్లు ఉన్నారు. పోలింగ్ రోజు చిరుజల్లులు కురవడంతో ఎండ తీవ్రత తగ్గి ఓటింగ్ పెరగడానికి దోహదపడింది.

గార్లదిన్నెలో 80.3 పోలింగ్ నమోదు

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా సోమవారం సార్వత్రిక ఎన్నికలు సజావుగా జరిగాయి. ఆయా గ్రామాల్లో ఉదయం నుంచి మహిళలు పెద్ద సంఖ్యలో పోలింగ్ కేంద్రాలు తరలి వచ్చి ఓటు వేసేందుకు క్యూ లైన్లో నిలిచారు. కేశవాపురం, ముంటిమడుగులో ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కావాల్సి ఉండగా అర్ధ గంట ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది.మర్తాడులో 37 పోలింగ్ కేంద్రంలో రాత్రి 8.30 వరకు పోలింగ్ జరిగింది. మండలంలో 80.3 శాతం పోలింగ్ నమోదైంది.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎమ్మెల్యే అభ్యర్థి వీరా

గార్లదిన్నె: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో అధికారులు ఐదు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా శింగనమల నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు గార్లదిన్నెలో ఆ పోలింగ్ కేంద్రాల్లోకి వెళ్లి ఓటింగ్ సరళి పరిశీలించారు. అలాగే ఓటు కోసం క్యూలో ఉన్న ఓటర్లకు అభివాదం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ నరేంద్ర రెడ్డి, అనంతపురం మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ నారాయణ రెడ్డి, వైస్ ఎంపీపీ, నాయకులు పాల్గొన్నారు.

నార్పల: నార్పల మండల వ్యాప్తంగా సోమవారం ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. నార్పల మండల వ్యాప్తంగా 85.77 శాతం ఓట్లు నమోదైనట్లు తహసీల్దార్ లక్ష్మినారాయణ తెలిపారు. రాష్ట్ర ఎంఎస్ఎంఈ డైరెక్టర్ రఘునాథ్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకుడు, అనంతపురం మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి కుటుంబసభ్యులతో కలసి ఓటు హక్కును వినియోగించుకున్నారు.



యల్లనూరులో బారులు తీరిన ఓటర్లు



యల్లనూరులో వికలాంగురాలిని ఓటు వేసేందుకు వీల్‌చైర్‌లో తీసుకెళ్తున్న దృశ్యం



పుట్లూరు మండలం శనగలగూడూరు వద్ద వృద్ధుడిని వీల్‌చైర్‌లో తీసుకెళ్లుతున్న దృశ్యం



గార్లదిన్నెలో ఓటు వేసేందుకు క్యూలో ఉన్న ఓటర్లు



పుట్లూరు మండలకేంద్రంలో పోలింగ్ స్టేషన్ వద్ద బారులు తీరిన ఓటర్లు



నార్పలలో ఓటు వేసేందుకు బారులు తీరిన జనం

తెలుగు తమ్ముళ్ల బరి తెగింపు



వైఎస్సార్‌సీపీ కార్యకర్త జయరామిరెడ్డి చొక్కా చింపిన దృశ్యం

బుక్కరాయసముద్రం: మండలంలో సోమవారం జరిగిన ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికలో తెలుగు దేశం పార్టీకి చెందిన నాయకులు బరితెగించారు. బీకేఎస్ మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాయం సమీపంలో 141 పోలింగ్ కేంద్రంలో ఓటు వేసే సమయంలో టీడీపీ నాయకులు వైఎస్సార్ సీపీ నాయకులపై దాడికి పాల్పడ్డారు. పోలీసులు ఇరు వర్గాలను చెదరకొట్టారు. అలాగే బీకేఎస్ జెడ్పీ హైస్కూల్‌లో 134 పోలింగ్ కేంద్రంలో టీడీపీ నాయకులు వైఎస్సార్ సీపీ నాయకులపై దాడికి యత్నించారు. రెడ్డిపల్లిలో వైఎస్సార్ సీపీ నాయకుడు జయరామిరెడ్డిపై అదే గ్రామానికి చెందిన రామక్రిష్ణ, అతని అనుచరులు చొక్కా చింపి దాడికి పాల్పడ్డాడు. అలాగే మండల కేంద్రంలో ప్రశాంతంగా పోలింగ్ జరిగింది. రోటరీపురంలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఏపీ ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, యువజన నాయకుడు ఆలూరి ఎర్రిస్వామిరెడ్డి, పి. కొత్తపల్లిలో జెడ్పీటీసీ భాస్కర్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సిద్దరాంపురంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణి ఓటు వినియోగించుకున్నారు.



కొత్తపల్లిలో ఓటుహక్కు వినియోగించుకున్న జెడ్పీటీసీ భాస్కర్



గోవిందపల్లిలో బారులు తీరిన ఓటర్లు